సూర్య
www.suryaa.com
రంగారెడ్డి - వికారాబాద్ మేడ్చల్
మంగళవారం 11 జూన్ 2024
పేజీలు : 9



మాజీ ఎమ్మెల్యే, తీగల క్రిష్ణ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నాడు టీకేఆర్ కళాశాలలో అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి టీకేఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. నర్సింహ్మారెడ్డితో పాటు ఈ కార్యక్రమంలో మీర్పేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్ధార్థ్, మాజీ వార్డ్ సభ్యులు కీసరి యాదిరెడ్డి, మీర్‌పేట మహిళా అధ్యక్షురాలు పద్మ, నాయకులు సురేందర్ రెడ్డి, విజయ్ రెడ్డి, పైల్లా శేఖర్ రెడ్డి, సొంటే వెంకటేష్, కాల కుమార్, కే.పరశురాం, సంతోష్, మురళి గౌడ్, సుభాష్ రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్న దృశ్యం.

### పెండింగ్‌లో ఉన్న పనులను శాఖల వారిగా

# పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి
- ఇక నుంచి అటెండెన్స్ యాప్‌లో హాజరు తప్పనిసరి
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు
- సీఎంఆర్‌పై దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వెల్లడి
- ప్రజావాణికి 96 ఫిర్యాదులు





వికారాబాద్ జిల్లా ప్రతినిధి,మేజర్‌న్యూస్(జూన్10)ః శాఖల వారిగా పెండింగ్ లో ఉన్న వివిధ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు.సోమవారం ప్రజావాణి లో భాగంగా ఆయన అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తో కలిసి ప్రజల నుండి ( 96 ) దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ... వివిధ శాఖల్లో జరుగుతున్న పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 12 నుండి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన వెంటనే పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు స్కూల్ యూనిఫామ్ లు అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల మరమ్మతుల నిమిత్తం జిల్లాలో 50 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. బడిబాటలో భాగంగా పెద్ద మొత్తంలో బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.అదేవిధంగా బడిబాట కార్యక్రమంలో మహిళా సంఘాలు భాగస్వాములు అయ్యేలా అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు.జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలతో పాటు మంచినీరు, పారిశుధ్యం పై సమీక్షలు నిర్వహించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో ఏవైనా మరమ్మత్తులు ఉంటే చేపట్టాలని ఆయన తెలిపారు. మిగతా 3లో

# రేవంత్ సీడ్ @ 2000

- రేవంత్ బిజి-2 పత్తి విత్తనాలకు ఫుల్ డిమాండ్
- వికారాబాద్ ఫర్టిలైజర్స్ షాపుల్లో జోరుగా కొనసాగుతున్న బ్లాక్ దందా..
- రేవంత్ బిజి-2 సీడ్ అసలు ధర రూ. 860
- కాని ఫర్టిలైజర్స్ షాపుల్లో రూ. 2 వేలపై విక్రయాలు
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న వ్యవసాయ అధికారులు




వికారాబాద్, మేజర్‌న్యూస్ (జూన్ 10)ః వర్షాలు కురవడం ప్రారంభం అయ్యాయి. రైతులు విత్తనాలు విత్తుటలకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. వికారాబాద్ ప్రాంతంలో ఎక్కువ మొత్తంలో రైతులు పత్తి పంట సాగు చేస్తారు. ఈ భూముల్ల పత్తి పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది. అందుకే రైతులు పత్తి పంట పండించడానికి ఆసక్తి చూపుతారు. వికారాబాద్ పట్టణంలో ఉన్న ఫర్టిలైజర్ డీలర్లు పలు రకాల పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచారు. అయితే గత సంవత్సరంలో రేవంత్ బిజి -2 అనే సీడు అధిక దిగుబడి వచ్చిందని నమ్మిన రైతులు ఈ సంవత్సరం అవే సీడ్ వేయుటకు మొగ్గు చూపుతున్నారు. దీంతో పలు ఫర్టిలైజర్ షాపుల్లో ఎక్కు మొత్తంలో రైతులు అదే సీడ్‌ను కొనుగోలు చేస్తున్నారు. రైతులు ఎక్కువ మొత్తంలో రేవంత్ సీడ్‌కు ఆసక్తి చూపడంతో ఇక డీలర్లు బ్లాక్ దందా షురూ చేశారు. ఈ సీడు అసల ధర కేవలం రూ. 860 లకు మాత్రమే విక్రయించాలి. కాని డీలర్లు మాత్రం ఏకంగా 2 వేల నుండి 3 వేల వరకు విక్రయిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. మిగతా 3లో

## వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ గౌతం పోట్రూ



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 10)ః వర్షాకాలం సమీపిస్తున్నందున వచ్చే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్లను,అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. సోమవారం రోజున కలెక్టరేట్ లోని విసి మీటింగ్ హాల్లో మున్సిపల్ కమిషనర్ల తో ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ గౌతమ్,అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాకాలం సమీపిస్తున్నందున ముందస్తుగా వర్షాకాల ప్రణాళికల ను సిద్ధం చేసి అమలు చేయాలని తెలిపారు. వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి వరద నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మ్యాన్ హోల్స్, కంట్రోల్ రూమ్, నాళాల పూడికతీత పనులు, ఎమర్జెన్సీ బృందాల గురించి మున్సిపల్ కమిషనర్ల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాళాలలో ఉన్న పూడిక పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని అన్నారు. మిగతా 3లో

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (జూన్ 10) : వర్షాకాలంలో వచ్చేస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసారి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీజనల్ వ్యాధుల పట్ల, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభమైనందున వర్షాలు, వరదల వలన నష్టం కలగకుండా ముందస్తుగా శిథిలమైన, కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లను గుర్తించి వెంటనే కూల్చి వెయ్యాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి వరదల తాటికి నివాస గృహాలు మునిగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వలన సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున, త్రాగు నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని అన్నారు. మంచినీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రపరచాలని, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్త కుప్పలను మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సీజన్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, మిషన్ భగీరథ అధికారులు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి భారీగా స్పందన

- వివిధ సమస్యలపై 79 ఫిర్యాదులు - ప్రజల వినతులపై సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించాలన్న కలెక్టర్





రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (జూన్ 10) : సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కారణంగా గత కొంత కాలంగా వాయిదాపడ్డ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నాడు అధికారులు మళ్లీ నిర్వహించారు. కొంత గ్యాప్ తరువాత నిర్వహించిన ఈ ప్రజావాణి కార్యక్రమానికి భారీ స్పందన కనిపించింది. వివిధ సమస్యలను ప్రస్థావిస్తూ... ప్రజల నుంచి 79 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అధికారులకు సూచించారు. సోమవారం నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ శశాంకతోపాటు అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డిఆర్ఓ సంగీతలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేసి, తదనంతరం పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పంపించడం జరుగుతోందని, అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట, వెంట పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించడం జరిగిందని, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయని తెలుస్తుందని తెలిపారు. ప్రజావాణికి వచ్చేటప్పుడు రిజిస్టర్ తీసుకొని రావాలని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10.30 గంటలకు జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ అధికారులందరు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వర్షాకాలం సందర్బంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి : శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి



బాలాపూర్ మేజర్ న్యూస్( జూన్ 10): రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అందుకు అధికారులు కూడా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆమె తమ క్యాంపు కార్యాలయంలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఎన్నికలకు గతంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పనుల గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా హెచ్ఎండిఏ ఎస్ ఎన్ డి పి నాలాలు మెయిన్ రోడ్స్, ఇంటర్నల్ రోడ్లు ,వీధి దీపాలు ,తాగునీరు, వంటి పలు అంశాలపై చర్చలు జరిపారు. అసంపూర్తిగా ఎక్కడైనా పనులు ఉంటే త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రతినిధులు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రహం శేఖర్. కమిషనర్ రఘు, బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ అర్జున్, కార్పొరేటర్లు భారతమ్మ కొమరయ్య యాదవ్, భీమిడి స్వప్న జంగారెడ్డి, లిక్కి మమతా కృష్ణారెడ్డి ,బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకటరెడ్డి, ముత్యాల లలితా కృష్ణ, కవిత రాంరెడ్డి, రోహిణి రమేష్, పెద్దబావి శ్రీనివాసరెడ్డి, ఏనుగు రామిరెడ్డి, చుక్క శివకుమార్, యాతం పవన్ కుమార్ యాదవ్ ,కో ఆప్షన్ సభ్యులు రఘునందన చారి, మర్రి జగన్మోహన్ రెడ్డి, ఎస్కే ఖలీల్ పాషా, సమైక్య జ్యోతి, అశోక్ అధికారులు హెచ్ఎం డబ్ల్యూ డి ఈ ఈ హరీష్ మున్సిపల్ కార్పొరేషన్ డి ఈఈ జ్యోతి రెడ్డి, ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ మున్సిపల్ కార్పొరేషన్ భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలి : ఎం ఈ ఓ సర్దార్ నాయక్



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (జూన్ 10) ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని.మండల విద్యాధికారి సర్దార్ నాయక్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని గుర్రం గుట్ట కాలనీలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ,విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. గుర్రం గుట్ట కాలనీలో ఇంటింటికి తిరిగి బడీడు కలిగి బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు ,యూనిఫారాలు ఇవ్వడంతో పాటు మధ్యాహ్నం భోజన వసతికల్పిస్తున్నట్లు ఎంఈఓ సర్దార్ నాయక్ తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలంతా పాల్పంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మమత, శ్రీలత,సిఆర్పిలు. బి. కిషన్ . ఎండి షేక్ అహమద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గేటు తండా లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు. కాశీ రావు,సంతోష .మరియు సిఆర్ పి .షేక్ అహమద్ పాల్గొన్నారు.

## ఆమనగల్లు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



ఆమనగల్లు, మేజర్ న్యూస్ జూన్ 10 ఆమనగల్లు పట్టణంలోని షాద్నగర్ మాడుగుల ప్రధాన రహదారి విస్తరణ పనులను సోమవారం ప్రారంభించారు. మూడేళ్ల క్రితం రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా అందులో భాగంగా సురసముద్రం చెరువు కట్ట కింది భాగంలో సిసి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టి తుది దశకు చేరుకోవడంతో అధికారులు పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా నుండి సందబావి వరకు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డబ్బాలు, చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి ఆర్ అండ్ బి డి ఈ రవీంద్ర కుమార్ పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు. రోడ్డు విస్తరణతో పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బంది తొలగడమే కాక దినదినం అభివృద్ధి జరుగుతుందని అందుకోసం విస్తరణకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని అధికారులు కోరుతున్నారు.

## పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



ఆమనగల్లు , మేజర్ న్యూస్ (జూన్ 10. )ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమనగల్లు ఐకెపి కార్యాలయంలో ఏపీఎం వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ సర్దార్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళా సంఘాల ద్వారా తయారు చేయించిన ఏకరూప దుస్తులను తోలివిడత 16 పాఠశాలలకు చెందిన 473 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఏపిఎంతో కలిసి ఎంఈఓ సర్దార్ నాయక్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు దుస్తులను అందజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించడం జరుగుతుందని ఇప్పటికే పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వంమహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పాఠశాలల విద్యార్థుల యూనిఫారాల తయారీని అప్పగించడం జరిగిందని ఏపీఎం వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీలత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శోభ.ఉపాధ్యాయులు కాశీ రావు, రామస్వామి.సుదర్శన్ రెడ్డి, ఐకెపి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కిషన్ రెడ్డికి అభినందనలు....అందెల

★మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్



బాలాపూర్ మేజర్ న్యూస్( జూన్ 10): కేంద్ర మంత్రివర్గంలో మళ్లీ చోటు దక్కించుకున్న సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులు గంగాపురం కిషన్ రెడ్డిని మహేశ్వరం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కొత్త ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అందేల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ....తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడిన జి కిషన్ రెడ్డి సేవలను మళ్లీ కొనసాగించేందుకు మోడీ హ్యాట్రిక్ ప్రభుత్వంలో మళ్లీ అవకాశం కల్పించడం తెలంగాణ ప్రజల అదృష్టమని అన్నారు. అంతకుముందు కరీంనగర్ ఎంపీ కేంద్రమంత్రివర్గంలో చోటు దక్కించుకున్న బండి సంజయ్ కుమార్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి ,రమేష్ గౌడ్, సహా పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికీ జన్మదిన శుభాకాంక్షలు

★రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి



బాలాపూర్ మేజర్ న్యూస్( జూన్ 10): కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి నీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్ధార్థ, మాజీ వార్డ్ మెంబర్ కీసరి యాదిరెడ్డి, మహిళ అధ్యక్షురాలు పద్మ, సురేందర్ రెడ్డి, విజయ్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, సొంటి వెంకటేష్, కాలా కుమార్ ,కె. పరుశురాం, సంతోష్, మురళి గౌడ్, సుభాష్ రెడ్డి, సైదులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యువకులు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సూర్య కథనానికి స్పందన..

- ఈదుల చెరువు రోడ్డు కబ్జాను అడ్డుకున్న గ్రామస్తులు
- అక్రమ నిర్మాణాన్ని సందర్శించిన ఇరిగేషన్ డీఈ, ఏఈ, తహశీల్దార్
- కల్వర్టు నిర్మాణాన్ని తొలగించాలంటు స్థానికుల డిమాండ్
- వారం రోజుల గడువు కోరిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు
- నామమాత్రమపు చర్యలతో చేతులు దులుపుకున్న వైనం
- అధికారుల తీరు పై మండిపడుతున్న గ్రామస్తులు, స్థానిక నాయకులు
- కల్వర్టు నిర్మాణాన్ని తొలగించే వరకు ఉద్యమిస్తామని గ్రామస్తుల హెచ్చరిక







అబ్దుల్లాపూర్‌మెట్, మేజర్‌న్యూస్ (జూన్-10) : సూర్య కథనానికి స్పందన. సూర్య దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన "పెద్దఅంబర్‌పేట ఈదుల చెరువు కబ్జా" అనే కథనానికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించారు. సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ ఉషాశ్రీ, ఏఈ రజాక్, అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ రవీంద్రనాథ్ దత్తు, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కమీషనర్ రవీందర్ రెడ్డి సోమవారం ఈదుల చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉషశ్రీ ఎన్‌క్లేవ్ వెంచర్‌దారులు అక్రమంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణ, కల్వర్టు పనులను సందర్శించారు. విషయం తెలుసుకున్న నాయకులు విజయేందర్ రెడ్డి, గంట లక్ష్మారెడ్డి, పండుగుల రాజు, స్థానిక గ్రామస్తులు పెద్ద ఎత్తున్న అక్కడికి చేరుకొని అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమంగా చేపడుతున్న కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఎలా తెలియకుండా ఉంటాయంటూ వారు మండిపడ్డారు. అధికారుల చేతివాటం వల్లనే వెంచర్‌దారులు ఏకంగా చెరువులోంచి అక్రమంగా రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. అధికారులు కన్నుసన్నల్లోనే ఈ తతంగమంత జరుగుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా చెరువులోంచి ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేసిన సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల పలు అనుమనాలు రేకెత్తుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. చెరువులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా చేపడుతున్న కల్వర్టు నిర్మాణాన్ని తొలగిస్తారా ? లేదా అని అధికారులను స్థానికులు నిలదీశారు. అధికారులు తొలగించకపోతే తామే స్వయంగా తొలగిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. తహశీల్దార్ రవీంద్రనాథ్ దత్తు వారం రోజులు గడువు కోరగా అందుకు గ్రామస్తులు నిరాకరించారు. ఉన్నఫలంగా కల్వర్టును ద్వంసం చేయాలని పట్టుబట్టారు. అధికారులకు గత్యంతరం లేక కమీషనర్‌తో మాట్లాడి జేసీబీలను రప్పించారు. కల్వర్టు నిర్మాణాన్ని నామమాత్రంగా ద్వంసం చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్తులు అధికారులు తీరు పై మండిపడ్డారు. కల్వర్టును జేసీబీతో ద్వంసం చేయడం సాధ్యం కావటం లేదని ప్రత్యేక యంత్రంతో ఖచ్చితంగా తొలగిస్తామని అధికారులు హామి ఇవ్వటంతో గ్రామస్తులు శాంతించారు. కాగా ఈదుల చెరువులోంచి యథేశ్చగా రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నఉషశ్రీ ఎన్‌క్లేవ్ వెంచర్‌దారుల పై చట్టపరమైన చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని గ్రాస్తులు అధికారులను కోరారు. అధికారులు చర్యలు తీసుకోలేని పక్షంలో పార్టీలకు అతీతంగా గ్రామస్తులమంత ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు హెచ్చిరించారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు భాగస్వామ్యులు కావాలి

– సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మినర్సింహ్మారెడ్డి



కడ్తాల్, మేజర్‌న్యూస్ (జూన్ 10): అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆటా 2024 కన్వెన్షన్‌లో ప్రవాస భారతీయులు ఏర్పాటుచేసిన తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం కార్యక్రమంలో పాల్గొన్నట్లు సర్పంచుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మినర్సింహ్మారెడ్డి తెలిపారు. టిడిఎఫ్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ప్రవాస భారతీయులు తెలంగాణలో విద్య, వైద్యం, నీటిపారుదల మొదలగు అంశాలపైన చర్చించినట్లు ఆయన వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న విద్యా పథకాలు, సత్ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వ, ప్రవాసభారతీయుల భాగస్వామ్యంపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తాను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు విద్యాభ్యాసం, క్రీడలలో సాధించిన విజయాలను అందరికి తెలిసే విధంగా ప్రతి గ్రామంలో కరపత్రాల ద్వారా లేదా అందుబాటులో ఉన్న వ్యవస్థ ద్వారా ప్రచారం నిర్వహించాలని, ఎక్కువ మొత్తంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విధంగా పాఠశాల అధ్యాపకులతో కలిసి ప్రణాళికను రూపొందించాలని కోరినట్లు చెప్పారు. సొంత గ్రామాలలో పాఠశాలల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐలు సహకరించాలని, ప్రతి ఎన్‌ఆర్‌ఐ సొంత ప్రాంతాలలో ఉన్న పాఠశాలను దత్తత తీసుకొని పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరినట్లు లక్ష్మినర్సింహ్మారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిఎఫ్ ఫౌండర్ మధు కె రెడ్డి, కిషోర్ గూడూరు, భరత్ రెడ్డి, ప్రీతి, నర్సింహ రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారని ఆయన వివరించారు.

# రోడ్లకు మరమ్మతులు చేయించిన బీజేఎంసీ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్



గండిపేట్, మేజర్‌న్యూస్ (జూన్ 10) : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని రోడ్ల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. సోమవారం బీజాపూర్ హైవేపై రోడ్డు గుంతలమయం కావడంతో రేడియల్ రోడ్డు ప్యాచ్‌వర్క్, బండ్లగూడ పెట్రోల్ పంపుకు వచ్చే దారిలో ప్యాచ్ వర్క్ పనులను కార్పోరేషన్ మేయర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్థానికంగా ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవతో పని చేయడం జరుగుతుందన్నారు. మంచినీరు, రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. స్థానికంగా రోడ్లు గుంతలమయం కావడంతో ప్రయాణికులు ప్రయాణాలు చేసేందుకు జంకుతున్నారన్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారని, అందుకే ప్యాచ్‌వర్క్‌లు చేయించడం జరిగిందని వివరించారు.

# తెలంగాణ రాష్ట్ర చిహ్నాం మార్పును స్వాగతిస్తున్నాం..

★ ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ ప్రదీప్ మహారాజ్



మంచాల, మేజర్ న్యూస్ (జూన్ 10) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర చిహ్నాం మార్పు చేయాలని నిర్ణయం తీసుకోవడాన్ని ధర్మ సమాజ్ పార్టీ స్వాగతిస్తుందని, అలాగే ధర్మ సమాజ్ పార్టీ సూచించిన చిహ్నాంను రాష్ట్ర చిహ్నాంగా ఆమోదించాలని ప్రభుత్వానికి సూచించడం జరిగిందని డిఎస్‌పీ మండల కన్వీనర్ ప్రదీప్ మహారాజ్ తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అద్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మహారాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అధికారికంగా ప్రకటించడం అలాగే రాష్ట్ర చిహ్నాంలో మార్పులు తేవాలని నిర్ణయించడాన్ని ధర్మ సమాజ్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మ సమాజ్ పార్టీ పక్షాన నూతన చిహ్నాన్ని తయారుచేసి అది ఆమోదించవలసిందిగా కోరడం జరుగుతుందన్నారు.ర్మ సమాజ్ పార్టీ రూపొందించిన చిహ్నాంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రం, అలాగే తెలంగాణ ప్రజలు ఎంతో గర్వించదగిన మహానీయులు అగ్రవర్ణ, భూస్వామ్య వ్యవస్థపై పోరాటం చేసిన వీరులు అణగారిన, బడుగు బలహీన వర్గాల, బహుజన రాజ్యం హక్కుల కోసం యుద్ధం చేసిన వీరుడు సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క సారక్క, చిత్రాలను రూపొందించడం జరిగిందన్నారు. సమసమాజ నిర్మాణం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యత కోసం రూపొందించిన చిహ్నామని ఈ చిహ్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్ మహారాజ్, రంజిత్ , లింగస్వామి, వంశీ, శివలింగం తదితరులు ఉన్నారు.

## నార్సింగి మున్సిపాలిటీలో అభివృద్ధికి చొరవ : మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లు

గండిపేట్, మేజర్‌న్యూస్ (జూన్ 10) : నార్సింగి మున్సిపాలిటీ అభివృద్ధికి చొరవతో పని చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మెన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మెన్ గోపాల విజయ్‌బాబులు అన్నారు. సోమవారం కోకాపేట్ ఎస్సీ సంఘం సభ్యులు నూతనంగా ఎన్నికైన చైర్మెన్, వైస్ చైర్మెన్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఎవరికి ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని వివరించారు. వాటి పరిష్కారానికి చొరవతో పని చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జీ.శివారెడ్డి, ఏ.దుర్గేష్ యాదవ్, లక్ష్మీ ప్రవళిక కిరణ్, గోపాల్, సునిత, గణేష్‌కుమార్, గండిపేట్ మండల అధ్యక్షులు అశోక్ యాదవ్, ఎస్సీ సంఘం అధ్యక్షులు ఆర్.యాదగిరి, ఉపేందర్, శిరీష్, ఎస్సీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు!

● ఊరూరా ఆటోల ద్వారా సరఫరా
● ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు
● చోద్యం చూస్తున్న అబ్కారీ శాఖ అధికారులు



కొడంగల్‌లో ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం ఇస్తున్న ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్

కొడంగల్, మేజర్ న్యూస్ (జూన్ 10): కొడంగల్ నియోజకవర్గంలో మద్యం వ్యాపారం బెల్టు షాపుల ద్వారా ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. కిరాణ షాపులు, హోటళ్లలో నిత్యావసర సరుకుల మాదిరిగా మద్యం అమ్మకాలను సాగిస్తున్నారు. అధికారులు మాత్రం బెల్టు షాపుల నిర్వాహణపై ఉక్కుపాదం మోపుతామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఐదు మద్యం బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. ఈ విషయం ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసినా పట్టనట్లు ఉంటున్నారు. నామమాత్రంగా అప్పుడప్పుడు దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ రేటుకు మద్యం అమ్ముతున్నప్పటికీ బెల్టు షాపుల్లో మాత్రం రేట్లను 10 నుంచి 20 శాతం పెంచి విక్రయాలు జరుపుతున్నారు. నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల, కొడంగల్ మండలాల్లో 7 మద్యం షాపులు కొనసాగుతున్నాయి. గతంలో ఎంత మంది బెల్టు షాపులు నిర్వహిస్తున్నారో గుర్తించి బైండోవర్ చేసేవారు. ఆ తర్వాత మద్యం బెల్టు షాపుల విషయాన్ని మర్చిపోయారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామాల్లో మద్యం ధరలను మాత్రం ఇష్టారాజ్యంగా పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో మద్యం ప్రియులు తప్పని పరిస్థితుల్లో ధర ఎంతైనా కొనుగోలు చేసుకొని సేవించాల్సిన దుస్థితి నెలకొంది. అయితే డిమాండ్‌ను బట్టి వ్యాపారస్తులు బీర్లు, విస్కీలకు కృతిమ కొరతను సృష్టిస్తున్నారు. మద్యం షాపులను దక్కించుకునేందుకు పోటీపడి టెండర్‌లో అధిక మొత్తానికి కైవసం చేసుకున్న వైన్స్ దుకాణాల వ్యాపారులు కొన్ని చోట్ల సిండికేట్‌నే నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఊరూరా సరఫరా... లక్షల్లో సంపాదన**

వైన్స్ షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. టెండర్‌లో ఎక్కువ ధరకు షాపులను దక్కించుకున్న వ్యాపారస్తులు మద్యాన్ని ఊరూరా సరఫరా చేసి లాభాలు గడించేందుకు యత్నిస్తున్నారు. నిత్యం ఆటోల ద్వార ఊరూరా తిరిగి అమ్ముతున్నారు. కేవలం ఒక షాపు ద్వారానే రెండు నుంచి మూడు లక్షలకుపైగా అమ్మకాలు జరుపుతున్నారు. వీరంత గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. బెల్టు షాపుల యజమానులు ఒక్కో బీరు, విస్కీ క్వార్టర్ సీసా మీద రూ. 10 నుంచి రూ. 20 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. వ్యాపారులు కిరణా షాపుల్లో చిల్లర వస్తువుల్లా అమ్మకాలు జరుపుతున్నారు.

**గ్రామాల్లో మందుబాబుల గొడవలు**

గ్రామాల్లో విరివిగా బెల్టు షాపులు ఉండటంతో గొడవలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. షాపులు అందుబాటులో ఉండటంతో మద్యం ప్రియులకు తాగాడానికి దూరం వెళ్లాల్సిన అవసరం లేకపోయింది. దీంతో షాపుల్లో ఖాతాలు పెట్టి మరీ తాగుడుకు బానిస అవుతున్నారు.

**బెల్టు షాపుల నుంచి డబ్బులు వసూలు**

బెల్టు షాపుల యజమానుల దగ్గరి నుంచి ఎక్సైజ్ అధికారులు డబ్బుల వసూలుకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఎక్కడ కూడా బెల్టు షాపును నిర్వహించరాదు. అయితే ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నా... కింది స్థాయి సిబ్బంది మాత్రం నెలనెలా మాముళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

**బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను అరికట్టాలి**
**ఎస్‌బీ.గుల్షన్, ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు**

బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం విక్రయాలను వెంటనే అరికట్టాలని ఎంఐఎం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి కొడంగల్‌లో ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా బెల్టు షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నా...అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కిరణా దుకాణాలు, హోటళ్లలో మద్యం విక్రయాలు కొనసాగించడంతో వయసుతో సంబంధం లేకుండా చిన్న, పెద్ద మద్యానికి బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతుండటంతో గొడవలు, ఘర్షణలకు దారి తీస్తుందన్నారు. యువత మద్యం మత్తులో రోడ్లపై వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల్లో తమ ప్రాణాలను కోల్పోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా అక్రమంగా కొనసాగుతున్న బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా షేక్ రోమాన్, ఎండీ.సర్తాజ్ హుసేన్, ఎండీ.షానవాజ్ హుసేన్, సయ్యద్ బాబా, ఎండీ.ఇబ్రహీం, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి తదితరులు ఉన్నారు.

# రాంపల్లిలో రెండు ఎకరాలలో కంపనీ కొరకు అక్రమ షెడ్ల నిర్మాణం

● భారీ ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి
● అనుమతులు లేని నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలి
● కలెక్టర్‌కు కొమ్ము లక్ష్మణ్ వినతి పత్రం దాఖలు



కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు పిర్యాదు చేస్తున్న దృశ్యం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 10): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మునిసిపాలిటి పరిధి లోని రాంపల్లిలో అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, రెండెకరాల విస్తీర్ణంలో అక్రమ షెడ్ (కంపెనీ) నిర్మాణము జరుగుచున్నదని, దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాంపల్లికి చెందిన కొమ్ము లక్ష్మణ్ అనేవ్యక్తి కలెక్టర్ ను కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రం దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాకు వివరాలు విడిదల చేస్తూ..రాంపల్లి కి చెందిన గండి అంజయ్య గౌడ్ అనే వ్యక్తి రాంపల్లి లోని సర్వే నెంబరు: 294, 301లలో రెండు ఎకరాలలో అక్రమంగా, ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, చట్ట విరుద్ధంగా, ఎటువంటి రుసుము చెల్లించకుండా దాదాపు 8000 ఎస్.ఎఫ్.టీలలో అక్రమ షెడ్డు నిర్మాణము చేపడు తున్నాడని, అట్టి నిర్మాణ మును తక్షణ మే నిలిపి వేయాలని కోరారు. అలాగే, సదరు నిర్మాణాన్ని తొలగించే లా, నాగారము మున్సి పాలిటీని ఆదేశించాలని కొమ్ము లక్ష్మణ్ కలెక్టర్‌ను కోరారు.





# జిల్లాలో పత్తి విత్తనాల కొరత లేదు

● జిల్లాలో ఈ వానాకాలంలో 2,63,500 ఎకరాలలో పత్తి సాగు అవుతుందని అంచనా
● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (జూన్ 10): జిల్లాలో ఈ వానాకాలంలో ప్రత్తి 2,63,500 ఎకరాలలో సాగు అవుతుందని అంచనా వేయడమైనదని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. 2,63,500 ఎకరాల ప్రత్తి సాగుబడికి 5,45,000 ప్రత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరమని, 4,23,316 ప్యాకెట్లు జిల్లాలో నిల్వ ఉండగా 1,43,764 ప్యాకెట్లు విక్రయం జరిగిందన్నారు. ప్రత్తి విత్తనాలకు ఎటువంటి కొరత లేదని, విత్తన డీలర్ల వద్ద ప్రస్తుతం సరిపడా స్టాక్ వుందని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన అన్నారు. డీలర్లు తమ లైసెన్సు వివరాలను, విత్తన వివరాలను షాప్ ముందు బోర్డుపై ప్రదర్శించాలని మరియు విత్తనాల నిల్వలు ఏఏ కంపెనీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయో వాటి ధరల పట్టికను ప్రతి రోజు బోర్డు పై ప్రదర్శించాలన్నారు. కొన్ని రకాల విత్తనాలు అధిక దిగుబాడులు ఇస్తాయని రైతులు అపోహ పడుతున్నారని కానీ అందులో ఏ మాత్రం వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు. ఎందుకంటే ప్రత్తిలో హైబ్రిడ్ విత్తన రకాలన్నీ ఒకే తరహా దిగుబడులు ఇస్తాయని, కావున కొనుగోళ్ల కోసం పోటీ పడాల్సిన అవసరం లేదన్నారు. బిజి్ధ రకం ఏ కంపనీదైనను తగిన సమయంలో సరియైన యాజమాన్య పద్ధతిలో విత్తుకోవటం, కలుపు నివారించుకోవటం, చీడపీడలు ఆశించకుండా తగిన మందులను పిచికారి చేయటం వంటివి పాటిస్తేనే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు అపోహ చెందకుండా బిజి్ధ రకం ఏ కంపని దైనను సాగు చేసుకోవలసిందిగా కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు అవగాహన



యాలాల మేజర్ న్యూస్ (జూన్ 10): మండలం పరిధిలోని రేండ్లగడ్డ తండాలో సోమవారం బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి 'బడిబాట రేండ్లగడ్డ తండాలో సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిచారు విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంప్రతి గ్రామపంచాయతీ తాండలో తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాల ఉండే విధంగా చర్యలు తీసుకొని పేద, మధ్య తరగతి తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా చూసేందుకు ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. దీంతో పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 'బడిబాట'పట్టారు. ప్రభుత్వం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి మిగిలిన అన్ని పాఠశాలలను కొత్త హంగులతో తీర్చిదిద్దుతోందన్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యాబోధనతోపాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులను అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం అందజేస్తోందన్నారు. బడీడు పిల్లలను, బడిమానేసిన విద్యారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చూచించారు. బడిబాట కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీతో పాటు చేర్మెన్ జుంటుపల్లి మద్దూరు లత, ఉపాధ్యాయులు పరమేష్, రాజశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

● ఎంపీడీవో రామకృష్ణ నాయక్



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జూన్ 10): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో రామకృష్ణ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బిందెంగడ్డ తండా, బొంరెడ్డిపల్లి గ్రామాలలోని నర్సరీ పనులను పరిశీలించి బడిబాట కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాఠశాలలో పిల్లలకు యూనిఫాం అందరికీ అందె విధంగా కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించి పాఠశాల ఓపెన్ చేసే లోపు అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. బడిడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని గ్రామంలో ఉన్న తల్లిదండ్రులు అందరికీ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి సెక్రటరీ సునీత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, పిల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల మరమ్మత్తుల పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో.

# సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశ పురోగతి సాధ్యం

## రావినారాయణరెడ్డి నగర్ కాలనీలో బడిబాట కార్యక్రమం



అబ్దుల్లాపూర్‌మెట్, మేజర్‌న్యూస్ (జూన్–10) : పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటి కుంట్లూర్ పరిధిలోని రావినారాయణ రెడ్డి నగర్ కాలనీ 12వ వార్డులో సోమవారం కుంట్లూర్ జడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులతో కలిసి ఆర్ఎన్ఆర్ కాలనీలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చదువుకుంటేనే దేశం ముందుకెళ్తుందన్నారు. చదువుకుంటేనే జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. చదువు ప్రాముఖ్యతను తల్లిదండ్రులు తెలుసుకొని వారి పిల్లలకు తప్పనిసరిగా అక్షరాభ్యాసం చేయిస్తేనే దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తుందన్నారు. బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. అక్షరాస్యత శాతం పెరగకపోతే దేశం అభివృద్ధిలో వెనుకబడిపోతుందన్నారు. చదువుకుంటే విజ్ఞానం పెరిగి మంచి చెడు విచక్షణ బొదపడుతుందన్నారు. చదువు జీవిత పాఠాల్ని నేర్పిస్తుందన్నారు. చదువుకుంటే ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఎలాగైనా బ్రతకవచ్చు అన్నారు. దేశం అభివృద్ధి చెందిన దేశాలతో పోటిపడాలంటే ప్రతి చిన్నారి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. చదువు మనిషి ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు డ్రాఫౌట్స్ లేకుండా చూసుకొని విధ్యార్థులకు నాణ్యమైన విద్యాభోదన చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జగన్మోహన్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, విద్యా కమిటీ ఛైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బడంగ్పేట్ కార్పొరేషన్‌లో సమీక్ష సమావేశం

★రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలి

★మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి అధికారులకు సూచన

బాలాపూర్ మేజర్ న్యూస్( జూన్ 10): బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పలు విభాగల శాఖలు,అధికారులతో కార్యాలయంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, మేయర్ కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులను బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో మేయర్ పారిజాత రెడ్డి మాట్లాడుతూ..... గత తీర్మానం 40 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్ల కోసం 12 కోట్ల రూపాయలు, డ్రైనేజీల నిర్మాణం కోసం పది కోట్ల రూపాయలు, బీటీ రోడ్లకు రెండు కోట్ల రూపాయలు, కమ్యూనిటీ హాల్ కోసం ఒక కోటి 70 లక్షల రూపాయలతో కొనసాగించడం జరిగిందని అన్నారు. వాటికోసం ప్రస్తుతానికి ఉన్న కార్పొరేషన్ బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకుని 12 కోట్ల రూపాయలతో టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యిందని త్వరలోనే పనుల ప్రక్రియ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గత ఆరు నెలల నుండి శాసనసభ ఎన్నికలు ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల మోడల్ కోడ్ కారణంగా పనులు ఆగిపోవడం జరిగిందని అన్నారు. కోడ్ ముగిసినందున పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రానున్న వర్షాకాలం దృష్ట్యా సానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. హెచ్ఎండిఏ నిధుల ద్వారా రోడ్ల నిర్మాణం మూడు దఫాలుగా



పూర్తి చేయనున్నట్లు అదే విధంగా నాలుగు చెరువుల నిర్మాణం త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఎస్ ఎన్ డి పి పనులు దాదాపు పూర్తి అయ్యాయని కొన్ని కోర్టు కేసుల మధ్యలో నిలిచిపోయాయని, వాటిని సైతం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని మేయర్ సూచించారు. నాలాలు శుభ్రం చేయాలని వీధి దీపాలను సైతం త్వరిత గతినఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ ఈ జ్యోతి రెడ్డి, యాదయ్య, హెచ్ఎండబ్ల్యూ డిఈఈ హరీష్, ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, ఏ ఈఈ లు బిక్కు నాయక్, వినీల్ గౌడ్, మేనేజర్ నగేష్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి, పలు విభాగాల సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలి : ఎస్ఐ మారయ్య



ఇబ్రహీంపట్నం, మేజర్ న్యూస్ (జూన్ 10): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని ఇబ్రహీంపట్నం ఎస్ఐ మారయ్య అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోచారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తాళ్ళపల్లి చిన్న ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎస్ఐ మారయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేరకు విజేతలుగా నిలిచిన జట్లకు ఆయన మనీ ప్రైజ్ తో పాటు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరాలని ప్రతి క్రీడాకారునికి సూచించారు. ఇలాంటి క్రీడలు నిర్వహించడం వల్ల యువతలోని నైపుణ్యాలను బయటకు తీయవచ్చని తెలిపారు. ఆటల,పోటీల్లో గెలుపోటములు ఆటలో సహజం అన్నారు. ఎప్పుడు కూడా ఆటల,పోటీలలో ఓటమిని కూడా గెలుపుగా స్వీకరించాలని సూచించారు. జీవితంలో చదువు ఎంత ప్రాముఖ్యమో, క్రీడలు కూడా అంతే ప్రాముఖ్యం అన్నారు. చెడు వ్యసనాలకు పోయి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇలాంటి క్రీడలు నిర్వహించి యువతలో నూతన ఉత్తేజాన్ని నింపుతున్న తాళ్ళపల్లి చిన్నను అభినందించారు. రానున్న రోజుల్లో ఇలాంటి క్రీడలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ళపల్లి చిన్న మాట్లాడుతూ... తమ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. యువత మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు వివరించారు. క్రీడలకు, యువతకు తమ వంతు సాకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం మొదటి విజేతగా నిలిచిన జట్టును, రన్నరప్ గా నిలిచిన జట్లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్ళపల్లి వెంకటేష్, గ్రామస్థులు తుమ్మటీ ఎన్టీఆర్, కాటం నర్సింహ, వెంకటేష్, మహేందర్, పెంటయ్య, శివగౌడ్, కృష్ణ, గొరిగే నర్సింహ, బోదాసూ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సహకార బ్యాంకు(టి.ఎస్.సి.ఏ.బి)వైస్ ఛైర్మన్‌గా కొత్తకుర్మ సత్తయ్య



తుర్కయంజాలు, మేజర్ న్యూస్ (జూన్ 10) : రాష్ట్ర సహకార బ్యాంకు(టి.ఎస్.సి.ఏ.బి)వైస్ ఛైర్మన్ గా రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్బంగా కొత్త కురుమ సత్తయ్యను పలువురు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర తనపై నమ్మకంతో రాష్ట్ర సహకార బ్యాంకు వైస్ ఛైర్మన్ గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర సహకార సంఘాల అభివృద్ధికి టి.ఎస్.సి.ఏ.బి ఛైర్మన్ రవీందర్ రావు తో కలిసి పని చేస్తానని అయన తెలిపారు. రైతుల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తానని అన్నారు.



## బీజేఎంసీ మేయర్‌ను సన్మానించిన వెంకటేశ్వర కాలనీ వాసులు



గండిపేట్, మేజర్‌న్యూస్ (జూన్ 10) : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ అభివృద్ధి కృషి చేస్తామని కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్‌ను వారు శాలువాతో సత్కరించారు. అనంతరం స్థానికంగా ఎదురవుతున్న విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని మేయర్‌ను కోరడంతో మేయర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంచినీరు, రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, పార్కులు, పాఠశాలలు అన్ని సమస్యలను దశాలవారిగా పరిష్కరిస్తామని వివరించారు. ఎవరికి ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు దుగ్గంపూడి వసంత, అమరేశ్వరి, కాసుల లావణ్య, సూర్య, సుష్మ, నాగుల జంగయ్య, కావలి పాండు, ప్రభాకర్‌గౌడ్, వెన్నెల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరిగూడలో ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం



ఇబ్రహీంపట్నం, మేజర్ న్యూస్ (జూన్ 10): శ్రీ మల్లికార్జున స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. శ్రీ మల్లికార్జున స్వామి దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధి కొరకు ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, శ్రీరామ్ యాదవ్ లు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి భవనం కూల్చివేత పనులు ప్రారంభం



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (జూన్ 10) ఆమనగల్లు పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం కూల్చివేత పనులను సోమవారం ప్రారంభించారు. ఆమనగల్లు పట్టణానికి నూతనంగా వైద్య విజ్ఞాన పరిషత్ ద్వారా 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా17. 50 కోట్లు మంజూరి అయ్యాయి దీంతో నూతన భవన నిర్మాణంలో భాగంగా పాత ఆసుపత్రి భవనాన్ని తొలగింపు పనులు చేపట్టారు. భవన నిర్మాణం పనులు వేగవంతం చేసి భవన నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఆమనగల్లు కు 50 పడకల ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి వస్తుండడం తో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందని ఐదు మండలాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రోడ్డు మరమ్మతులు బాగు చేయండి

● ఆర్అండ్‌బిఏఈకి వినతి పత్రం అందజేత

● బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రవీందర్



పూడూరు మేజర్ న్యూస్ (జూన్ 10)ః పూడూరు మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి గేటు నుండి లాల్ పహాడ్ వరకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ అన్నారు. సోమవారం పరిగి ఆర్ అండ్ బి కార్యాలయంలో ఏఈ మహేష్ కు ఈ రహదారి ని బాగు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ రహదారి మార్గంలో డబుల్ రోడ్డు వేయాలని అన్నారు. ఈ రోడ్డు గుండా అంగడి చిట్టంపల్లి చన్గోముల్ మేడిపల్లి కుత్బుల్లాపూర్ కంకల్ చింతలపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ దారి గుండా ప్రయాణం చేస్తారని అన్నారు. కంకల్ గ్రామ సమీపంలో లిక్కర్ ఫ్యాక్టరీకి వెళ్లే పెద్దపెద్ద వాహనాలతో రోడ్డు గుంతల మయంగా మారి ప్రయాణం నరక ప్రయాణ మారిందని తెలిపారు. అంగడిచిట్టంపల్లి నుండి లాల్ పహాడ్ వెళ్లే మార్గాన్ని వెంటనే రోడ్డు మరమ్మత్తులు బాగు చేయాలని అన్నారు. వర్షాకాలం కావడంతో రైతులు ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు శేఖర్, నర్సింలు, సుధాకర్, వెంకటేష్, శ్రీనివాస్, సుదర్శన్, నిఖిల్, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికులకు ఏడు నెలలజీతాలు వెంటనే చెల్లించాలి

● తెలంగాణ గ్రామ పంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఎన్ .శ్రీనివాస్



మేడ్చల్ జిల్లా, ప్రతినిధి,మేజర్ న్యూస్(జూన్,10): ఈరోజు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల నుండి 7 నెల వరకు జీతాలు బకాయి పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేశారు. ఏడు నెలల జీతం రాకపోతే కార్మికులు ఎలా బ్రతకాలి, వాళ్ళ నిత్యవసర జీవితాలు గడవడమే కష్టమైతున్నాయి .రాష్ట్ర ముఖ్యమంత్రి గారు దళితల జీవితాలను ఇబ్బంది పెడుతున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. వెంటనే బకాయి పడ్డ 7 నెల గ్రామపంచాయతీ కార్మికుల జీతభత్యాన్ని చెల్లించాలని మరియు వారికి ఇవ్వాల్సిన సబ్బు ,నూనె, చెప్పులు, బట్టలు వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఉన్నీకృష్ణన్, గ్రామపంచాయతీ జిల్లా నాయకులు ముత్యాలు బాబు లక్ష్మయ్య నరసింహ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# వివిధ గ్రామాలలో బడి బాట కార్యక్రమం



బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

దోమ, మేజర్‌న్యూస్ (జూన్ 10)ః బడి బాటలో భాగంగా జెపిఎచ్ఎస్ బొంపల్లి కాంప్లెక్స్ పరిధి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూమ్ పల్లి, పీఏస్ బొంపల్లి ,బాస్పల్లి, పాఠశాలలో బడి బాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోమ మండల ఎంపిడిఓ పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించారు. విద్యార్థులందరికీ ప్రభుత్వ పాఠశాలకు పంపాలన్నారు. దోమ ఎంఈఓ హరించంద్ర మండలం లో ఉన్న అన్ని ఊర్లలో ఉన్న విద్యార్థులందరు ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలి ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు యూనిఫామ్ ఇవ్వడం తో పాటు మధ్యాహ్నం రుచికరమైన భోజనం వారానికి మూడు సార్లు గుడ్లు రాగి జావా తో పాటు నాణ్యమైన విద్యను ఇవ్వడం జరుగుతుందన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా అన్ని పాఠశాలల్లో ఎలక్ట్రికల్ వర్క్, టాయిలెట్స్, మేజర్ మైనర్ రిపెట్స్ మంచి నీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. సోమవారం నుండి అన్ని పాఠశాలల్లో బుక్స్ నోట్ బుక్స్ యూనిఫామ్ కూడా ఇవ్వడం జరిగింది అన్నారు.

ఈ బడిబాట కార్యక్రమంలో బొంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులువెంకట్, బాస్పల్లి ప్రధానోపాధ్యా యురాలు సుహాసిని మేడం, పియస్ బొంపల్లి ప్రధానోపాధ్యాయులు షఫీ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, చెర్మాన్‌లు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ శిక్షణ..భవితకు రక్షణ



కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో శిక్షణ కేంద్రం నిర్వాహకుడు పద్మనాభారెడ్డి

కొడంగల్, మేజర్ న్యూస్ (జూన్ 10): కంప్యూటర్ శిక్షణ..భవితకు రక్షణ అని కొడంగల్ పట్టణంలోని ఏఎస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు పద్మనాభారెడ్డి తెలిపారు. సాంకేతిక రంగంలో పరుగులు పెడుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతీ ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మిషన్ ఆధ్వర్యంలో కొడంగల్, తాండూర్‌లో వేసవిలో 45 రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సోమవారం పరీక్షలు నిర్వహించారు.

# కార్మికుల సంక్షేమ బోర్డుకు చైర్మన్‌ను వెంటనే నియమించాలి

● కలెక్టరేట్ వరకు కార్మికుల బైక్ ర్యాలీ

● మీ సేవ ద్వారా ఇచ్చిన కార్డులను రద్దు చేయాలి

● బిఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలయ్య

● ప్రజావాణిలో వినతి పత్రం అందజేత






మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 10)ః భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమ బోర్డ్ ను ఏర్పాటు చేసి, చైర్మన్ ను నియమించాలని బి.ఎన్.ఆర్.కే.ఎస్.రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన జిల్లాలోని భవన నిర్మాణ రంగాల కార్మికులతో కలిసి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్ వద్ద మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు మీ సేవ ద్వారా సభ్యత్వం ఇవ్వటం వల్ల బోగస్ కార్మికులు సభ్యత్వం పొందుతున్నారని అందువల్ల ఈ పద్ధతిని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, బోగస్ సభ్యత్వాన్ని ఏరివేయాలని కోరారు. కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యల వినతి పత్రాన్ని అందజేశారు. 2009 నుంచి సభ్యత్వం తీసుకున్న కార్మికుల వివరాలు ఆన్ లైన్ చేయాలని, పెన్షన్, కార్డుల రెన్యువల్ చేపట్టాలని, కార్మికులకు బైకులు మంజూరు చేయాలని ఐలయ్య తన వినతి పత్రం లో వివరించారు. ర్యాలీలో భవన నిర్మాణ రంగ కార్మిక సంగం నాయకులు రవి, కొండల్, చిత్తారి, ఉప్పలయ్య, యాదగిరి,వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న దృశ్యం.

మేడిపల్లి మేజర్ న్యూస్ (జూన్ 10)ః పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమిషనర్ త్రిరేశ్వర్ రావుతో కలి ప్రారంభించి నగర ప్రజలనుంచి పిర్యాదులు, వినతి పత్రాలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ధ్యేయంగా తాము పనిచేస్తామన్నారు. సుమారు 32ఆర్జీలు అందాయని పలు సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు మిగిలిన వాటిని పిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సంబందిత శాఖపరమైన అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అందిన పిర్యాదుల్లో ఎక్కువశాతం కరెంటు సమస్యలపైనే- 12 ఆర్జీలు, వాటర్ వర్క్ సమస్యలపైన- 10,రోడ్డు సమస్యలపైన- 5, పెన్షన్లపైన-2, గ్యాస్ సబ్సీడీపైన-3 ఆర్జీలు అందాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్ర మంలో ఆర్వో శ్రీనివాస్ రెడ్డి,మేనేజర్ జ్యోతి రెడ్డి, ఎఈ బిక్షపతి, టీపీఓ ఆలీపా షా, ఎలక్ట్రికల్ ఎఈ హరినాథ్, జలమండలి వెంకగేశ్. వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ పాల్ రెడ్డి. ఎలక్ట్రికల్ ఎఈ ప్రధీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 18న మత్స్య శాఖ జిల్లా సంఘం ఎన్నికలు

● నోటిఫికేషన్ విడుదల

● జిల్లా మత్స్య శాఖ అధికారిణి పూర్ణిమా సింగ్ వెల్లడి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 10)ః

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలకు, డి.ఎఫ్.వో పూర్ణిమ సింగ్, ఎన్నికల అధికారి నాగ లింగాచారి లు సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 13 న నామినేషన్ల స్వీరణ,18న పోలింగ్, ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ మేడ్చల్ లోని అలంకరణ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం లో నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు.



# తాండూరులో కబ్జాకు గురైన కోట్లాది రూపాయల విలువైన భూమి స్వాధీనం

సూర్య ఎఫెక్ట్

- కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో అధ్వర్యంలో ం చేసుకున్న అధికారులు
- కబ్జాను వెలుగులోకి తెచ్చిన "సూర్య"


భూమినీ స్వాధీనం చేసుకుంటున్న అధికారులు.

తాండూరు,మేజర్‌న్యూస్( జూన్ 10): వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని విజయ విద్యాలయ హై స్కూల్ పక్కల గల సర్వే నెంబర్ 111లో కబ్జాకు గురైన కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ఎట్టకేలకు సోమవారం నాడు రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఇక్కడ దాదాపుగా పది కోట్ల రూపాయల విలువైన భూమిని కొందరు ఫేక్ పత్రాలు సృష్టించి ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ చేసి ఒక్క బోర్డును ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన వార్తను సూర్య దినపత్రిక సోమవారం నాడు "సిఎం రేవంత్ సొంత జిల్లాలో విచ్చలవిడిగా భూ కబ్జాలు" అనే టైటిల్ పేరుతో వార్తను ప్రచురించింది.దీంతో పాటు పలువురు ఈ భూకబ్జా పై ఫిర్యాదులు కుడా చేశారు.జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ అధికారుల బృందం సోమవారం నాడు సర్వే చేపట్టి కబ్జాకు గురైన భూమిని ప్రభుత్వ భూమిగా తెల్చివేశారు. తాండూరు ఆర్డీవో శ్రీనివాస్ రావు అధ్వర్యంలో తాండూరు తహశీల్దార్ తారసింగ్,గిర్దవార్ లు రాజీ రెడ్డి,బాల్ రాజ్,ఉప తహశీల్దార్ విజేందర్,సర్వేయర్ శ్రీహరి కబ్జాకు గురైన భూమినీ పరిశీలించారు.అక్కడకు చేరుకున్న కొందరు ఈ భూమి తమదే అంటూ అధికారులతో అన్నారు.ఈ భూమి ప్రభుత్వ భూమి అని అన్నీ రికార్డులు ఉన్నాయని,హై కోర్టులో కూడా కేసు ఉన్నదని ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు.ఈ భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందిన భూమి అని తహశీల్దార్ ఒక నివేదికను తయారు చేసి ఆర్డీవో శ్రీనివాస్ రావుకు ఇచ్చారు.దీంతో ఆర్డీవో ఆదేశాల మేరకు అక్కడ ఏర్పాటు చేసిన కబ్జా బోర్డును తొలగించి ప్రభుత్వ భూమిగా కొత్త బోర్డును ఏర్పాటు చేశారు.కబ్జా కొరులను తన్నేసి భూమినీ స్వాధీనం చేసుకోవడంతో రెవిన్యూ శాఖ అధికారులను పలువురు అభినందించారు.

## ప్రభుత్వ భూముల జోలికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం...

- ఎంతటి వారినైన వదిలి పెట్టాం
- తాండూరులో కబ్జాకు గురైన భూమి స్వాధీనం
- తాండూరు ఆర్డీవో శ్రీనివాస్ రావు వెల్లడి




తాండూరు,మేజర్‌న్యూస్(జూన్ 10):ప్రభుత్వ భూముల జోలికి వచ్చి ఎవరైనా ఆ భూములను కబ్జాలు చేస్తే వదిలి పెట్టే ప్రసక్తే లేదని అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తాండూరు ఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నాడు ఆయన సూర్య దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ....ఎవరైనా తెలిసి తెలియక ప్రభుత్వ భూముల జోలికి వస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాండూరు టౌన్‌లోనీ విజయ విద్యాలయ పాఠశాల పక్కన సర్వే నెంబర్ 111లో గల ప్రభుత్వ భూమిలోకి కొందరు జొరబడి భూమి చుట్టూ ఫెన్సింగ్ చేసి కబ్జా చేశారని ఆయన అన్నారు. దీనికి సంబందించిన పూర్తి వివరాలు రాబట్టి ఈ భూమి ప్రభుత్వ భూమిగా పరిగణించి వెంటనే నిన్న సోమవారం నాడు కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేయించి కబ్జాకు గురైన భూమినీ స్వాధీనం చేసుకున్నట్లు ఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. కొందరు ఫెక్ పత్రాలు సృష్టించి కబ్జాకు పూనుకున్నారని ఆయన అన్నారు.ఈ భూమి ప్రభుత్వ భూమిగా గతంలో కూడా రెవిన్యూ శాఖ అధికారులు తేల్చారని, హైకోర్టు కూడా స్టే ఇచ్చిందని గుర్తు చేశారు.తాము ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- ప్రతి అర్జీకి జవాబు దారి తనం ఉండాలి
- జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 10): ప్రజావాణికి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ... ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరించాలన్నారు. అలాగే, ప్రజావాణి ఫిర్యాదు లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సారి ప్రజావాణిలో 90 మంది అర్జీలు దాఖలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని మోది పాలనలో దేశం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి

- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల చొరవతో తెలంగాణ అభివృద్ధికి పెద్దపీట
- ప్రజల ఆధరాభిమానాలతో రాష్ట్రంలో 8 ఎంపి స్థానాలు బిజెపి కైవసం కావడం హర్షదాయకం
- ఇచ్చిన హామిలను విస్మరించి ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు
- రాబోవు ఎన్నికల నాటికి తెలంగా ణలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయం
- బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూన్ 10): దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందిస్తూ గడిచిన పదేండ్ల కాలంలో వందలాది సంక్షేమ, అభివృద్ధి పథకాలతో భారత్‌ను ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిపిన ప్రధాని నరేంద్ర మోది పాలనకు అన్నివర్గాల ప్రజలు బ్రహ్మరథం పట్టి మరోమారు అధికారం కట్టబెట్టినట్లు భారతీయ జనతాపార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు తుమ్మేటి వెంకట్‌రెడ్డి అన్నారు.గడిచిన 10యేండ్ల పాలనలో బిజెపి ప్రభుత్వం 370 ఆర్టికల్, త్రిబుల్ తలాక్ రద్దు, భవ్యరామమందిర నిర్మాణం వంటి అనేక సాహసోపేత నిర్ణయాలతో దేశంలో నూతనశకానికి ప్రధాని నాంది పలికినట్లు ఆయన పేర్కొన్నారు. మాడ్గుల మండలం నర్సంపల్లి గ్రామంలో సోమవారం తుమ్మేటి వెంకట్‌రెడ్డి మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ ప్రజలందరి ఆధరాభిమానాలతో తెలంగాణలో 8 లోక్‌సభ స్థానాలు బిజెపి కైవసం చేసుకోవడం ఆనందంగా వుందన్నారు. మోది 3.0 కెబినెట్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులైన గంగాపురం కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రిగా, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులైన బండిసంజయ్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా స్థానం దక్కడం హర్షదాయకమన్నారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె అరుణ మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలిగా గెలిపించేందుకు కృషిచేసిన బిజెపి, బిజెపి మోర్చాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో బిజెపి అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ ద్వితీయస్థానంలో నిలువడం కూడ బిజెపి బలపడిందనేందుకు నిదర్శనమని తుమ్మేటి పేర్కొన్నారు. ఇచ్చిన హామిలను విస్మరించిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ప్రజావిశ్వాసం కోల్పోయాయని, రాబోవు అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బిజెపి మరింత బలపడి తెలంగాణలో అధికారం దక్కించుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## నకిలీ విత్తనాలు పట్టుకున్న అధికారులు





యాలాల,మేజర్ న్యూస్ (జూన్ 10) : మండల పరిధిలో ని ప గిడ్యా ల గ్రామం లో సోమ వారం సాయంత్రం వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాల గుట్టురట్టు చేశారు.యాలాల మండల అగ్రికల్చర్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. పగిడ్యాల గ్రామానికి చెందిన కొత్త కిష్టప్ప వద్ద నకిలీ పత్తి విత్తనాలు,ఎలాంటి బ్రాండ్ పేరు లేనివి ఉన్నాయని సమాచారం రాగా వ్యవసాయ శాఖ అధికారులు ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించగా అతని వద్ద ఒక క్వింటాల్ నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి.దొరికిన నకిలీ పత్తి విత్తనాలను సీజ్ చేసి యాలాల పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి విచారించగా అతను కోస్గి మండల్ కొత్తపల్లికి చెందిన నరేష్ వద్ద తీసుకువచ్చినట్లు విచారణలో తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు యలాల పోలీసులు తెలిపారు.

## కనీస అవసరాల పట్ల అవగాహన ముఖ్యం




మణికొండ, మేజర్ న్యూస్ (జూన్ 10): కనీస అవసరాల పట్ల అవగాహన ఎంతో ముఖ్యం అని సీతారాం దూళిపాళ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్టు ఎడ్యుకేట్, ఆర్గనైజ్, యాజిటెట్ అనే పదాలను స్ఫూర్తి దాయకంగా తీసుకొని సమ సామాజిక రాజకీయాల దృష్ట్యా ప్రజలలో కనీస అవసరాల పట్ల అవగాహన కల్పించడానికి ది సిటిజన్స్ కౌన్సిల్ అనే సంస్థను నెలకొల్పామని ది సిటిజన్ కౌన్సిల్ అద్యక్షుడు సీతారాం దూళిపాళ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి విద్య మరియు ఆరోగ్యం అందుబాటులో ఉండే విధంగా కృషి చేయడం, మెరుగైన కనీస అవసరాలు అయినటు వంటి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు, మురుగునీటి వ్యవస్థ సక్రమంగా ఉండే విధంగా కృషి చేయడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోరకు అందరిలో అవగాహన కల్పించి, కుల మతాలకు అతీతంగా పనిచేయడమే మా ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ఈ సంస్థలో సభ్యులుగా చేరాలనుకున్నవారు స్థానికంగా ఇళ్లు లేదా జాగా, ప్లాట్ ఓనర్ అయి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సంస్థ యొక్క ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్, ఉపాధ్యాడు అందే లక్ష్మణ్‌రావు, ఉప కార్యదర్శిగా ఉపేందర్‌నాధ్‌రెడ్డి, కోశాధికారిగా దిలీప్ కక్కడ్, కార్య నిర్వహాక సభ్యులుగా రామ సుబ్బారెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేఎంసీలో చెరువుల ఆధునీకరణకు చర్యలు : డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి


పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

గండిపేట్, మేజర్‌న్యూస్ (జూన్ 10) : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని చెరువు, కుంటలను సుందరీకరణ చేసేందుకు చొరవ చూపుతున్నామని కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పోరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ ఎర్రకుంట పూడికతీత పనుల్లో భాగంగా ఎర్రకుంటకు సపోర్ట్‌గా నిర్మించనున్న కంపౌండ్ వాల్ పనులను డిప్యూటీ మేయర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా చెరువులు, కుంటలలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దశలవారిగా అన్ని చెరువులను ఆధునీకరిస్తామన్నారు. ఈ మేరకు అధికారులతో నిరంతరం చర్చిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, డీఈఈ యాదయ్య, సీనియర్ నాయకులు టింకురెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు రవికాంత్‌రెడ్డి, కాంట్రాక్టర్ రామ్‌రెడ్డి, లక్ష్మినగర్ కాలనీ అధ్యక్షులు, భాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు ఉన్నారు.

# అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఎస్.ఎఫ్.ఐ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూన్ 10):
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల లపై చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ తదితరులు కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన వివరాలను పత్రికలకు విడుదల చేస్తూ.. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా అనేక ప్రైవేట్, కార్పొరేట్, సీ.బీ.ఎస్సీ స్కూళ్లు అకడమిక్ ఇయర్ ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేసుకుంటూ, లక్షల రూపాయల ఫీజులు గుంజుతున్నారని, వీటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సంతోష్ జిల్లా కలెక్టర్ ను కోరారు. కార్యక్రమంలో తరుణ్, అవినాష్, సాయి కు పాల్గొన్నారు.


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

# సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

కూకట్ పల్లి మేజర్ న్యూస్ : రిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో రోడ్లు డ్రైనేజీ లైన్లకు సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ జీఎచ్ఎంసి అధికారులు కాలనీ వాసులతో కలిసి వాంబే కాలనీలో పర్యటించి పాదయాత్ర చేస్తూ సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాంబే కాలనీలో కొన్నిచోట్ల బిల్డింగ్ మధ్యలో నూతన డ్రైనేజీ లైన్ నిర్మించి, ప్రధాన లైన్ కు కలిపి డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా త్రాగునీరు సమస్య లేకుండా చూడాలని వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. కాలనీలో చాలాచోట్ల మట్టికుప్పలు ఉన్నాయని వాటిని తొలగించకుంటే రానున్న వర్షాకాలంలో కుత్బుల్లాపూర్ నుండి వచ్చే వరద నీటితో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది కాబట్టి వెంటనే మట్టికుప్పలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కాలనీలో అవసరమైన సీసీ రోడ్ల కొరకు ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరారు. అతిత్వరలో వాంబే కాలనీలోని డ్రైనేజ్ సమస్య పరిష్కరించి, మట్టి కుప్పలు తొలగించి, సీసీ రోడ్లు నిర్మించి, చెట్లు పెట్టి కాలనీని సుందరంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎచ్ఎంసి అధికారులు ఎఇ శ్రావణి, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఎస్.ఆర్.పి నాగేశ్వర్ నాయక్, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ సుదర్శన్ వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, వెంకట్ నాయక్, అగ్రవాసు, పోశెట్టిగౌడ్, నరసింహ, సన్యాసిరావు, వాంబే కాలనీ వాసులు శ్రీలత, రాజు, మునీర్, కె.రవి, గిరి, రాజు, జానీ, యాదయ్య, రవి, విజయలక్ష్మి, సమీరా, ఖాజా బి, ఆశ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ రేట్ల పెంపుకై హమాలీ యూనియన్ సివిల్ సప్లయిస్ భవన్ ముట్టడించిన ఎఐటియుసి

సోమాజిగూడ/మేజర్ న్యూస్:ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వందలాది మంది హమాలీలు, స్వీపర్లతో ముట్టడిరచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సివిల్ సప్లయిస్ హమాలీలకు హమాలీ రేట్లు క్వింటాలు, ఎగుమతి, దిగుమతికి రూ.35లు చెల్లించాలని లిఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్‌లి డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుండి పాల్గొన్న హమాలీ కార్మికులు నేడు సివిల్ సప్లయి భవన్‌ను ముట్టడిరచి హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హమాలీ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు ముట్టడిని భగ్నం చేసేందుకు కార్మికులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేసినా హమాలీలు మొక్కవోని ధైర్యంతో పిక్కటిల్లె నినాదాలు చేస్తూ సివిల్ సప్లయీస్ భవన్‌లోకి చోచ్చుకు పోయ ప్రయత్నం చేశారని ఆయన అన్నారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచి అమలు చేయాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు 5 నెలలు గడిచినా కనీసం చర్చలకు పిలవకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలోని 187 మండల పాయింట్లలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు దసర పండుగ సందర్భంగా ఇచ్చే స్వీటుకు రూ.1200లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా ఇయస్ఐ శాఖ అధికారులు సివిల్ సప్లయిస్ బ్యాంకు ఖాతానుండి ఒక కోటి 50లక్షలు తీసికెళ్ళిన సివిల్ సప్లయిస్ హమాలీలకు ఇయస్ఐ సౌకర్యం కల్పించకుండా కార్పొరేషన్ అధికారులు కాలయాపన చేసినప్పటికి, ఇయస్ఐ డబ్బులు తప్పనిసరిగా చట్టం ప్రకారం చెల్లించాల్సిందేనని ఆయన తెలిపారు. హమాలీ కార్మికులు ఎగుమతి, దిగుమతి చేస్తున్న సందర్భంగా జరుగుతున్న ప్రమాదాలకు ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. అనేక పోరాటాల ఫలితంగా సివిల్ సప్లయిస్ హమాలీలకు బోనస్ దశల వారిగా పెంచుతూ 6500లు సంవత్సరానికి చెల్లిస్తున్నందున దానిని 10వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులు బరువులు మోయటం, దింపటం వల్ల మోకాళ్ళ చిప్పలు అరిగి 40 సంవత్సరాలకే నడవలేని పరిస్థితి వస్తుందని రిటైర్‌అయిన కార్మికులందరికి ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ చెల్లించేలా ప్రభుత్వం, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం లక్షలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామంటూ చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదం కాకుండా రాష్ట్రంలోని 3200హమాలీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ యూనిఫాం కుట్టుకూలికి 2 జతలకు 1300లు మాత్రమే చెల్లిస్తున్నారని పెరుగుతున్న కూలీ రేట్ల ప్రకారం రూ.2వేలకు పెంచి చెల్లించాలని ఆయన అధికారులను కోరారు. అనేక దశాబ్దాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అన్ని గోడౌన్లలో పనిచేస్తున్న హమాలీ కార్మికులను పని అవసరాన్ని బట్టి నియమించుకునే అవకాశాన్ని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు తొలగించటం, కొత్తవారిని తీసుకోవద్దని నిబంధనలు పెట్టటంతో కార్మికులపై పనిభారం పెరిగి అనేక అవస్థలకు గురవుతున్నారని, అవసరానికి తగ్గట్టుగా నియమించుకునే అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు దేశవ్యాపితంగా ఎనీట్కెం రేషన్ పేరుతో కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు రేషన్ బియ్యాన్ని ఎటిఎం/ ఎటిఆర్ ల ద్వారా పంపణీ చేసే ఆలోచనను విరమించుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ రోజు జరిగిన ఈ భారీ ముట్టడిలో 600లకుపైగా హమాలీ కార్మికులు పాల్గొని పెద్ద ఎత్తున నినదాలు ఇస్తూ పాల్గొన్నారు. ముట్టడి అనంతరం లిసివిల్ సప్లయిస్ కమీషనర్ చౌహాన్‌లి క్రిందికి వచ్చి సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన డిమాండ్ల కాపీని తీసుకొని ఒక్కొక్క డిమాండ్‌పై వివరంగా కమీషనర్ గారికి తెలియజేయటంతో త్వరలోనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా డైరెక్టర్ గారు యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమీషనర్, డైరెక్టర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఒకవేళ అమలు చేయలేని పక్షంలో సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేస్తామని ఆయన హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టి.సమ్మయ్య నాయకులు ఎన్.దేవేందర్, బాల్‌రాజ్, జకరయ్య, ఆలేరుశ్రీను, గొరిగె నర్సింహ్మా, సంపత్‌తో పాటు వందలాది మంది పాల్గొన్నారు.

# బడిబాట కమిటి ఏర్పాటు


బడిబాట కార్యక్రమంపై అవగాహన సమావేశం.

కీసర,మేజర్‌న్యూస్:ప్రభుత్వ పాఠశాల్లో విధ్యార్థుల సంఖ్య పెంచేందుకు కీసర మండల అధికారులు బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల్లో విధ్యాభ్యాసం, సౌకర్యాలు వంటి అంశాలపై విధ్యార్తుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఏంతైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈమేరకు కీసర మండల పరిషత్ కార్యాలయంలో మండల విధ్యాధికారి శశీధర్ అధ్యక్షతన బడిబాట కమిటి ఏర్పాటు సమావేశం జరిగింది. ఎంపిడివో, తహశీల్దార్, ఎస్‌హెచ్‌వో కీసర, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, క్లస్టర్ రీసోర్స్ పర్సన్‌లతో సోమవారం ఎంఈవో బడాబాట కమిటిని ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం సైతం ఏర్పాటు చేసి బడిబాటపై అవగాహన కల్పించారు.

# విద్యుత్ ఘాతానికి పాడి పశువు మృతి



పూడూర్ మేజర్ న్యూస్ (జూన్ 10): ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి పాడి పశువు బలైన సంఘటన మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో చోటుచేసుకుంది. ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు నేలకు తాకడంతో ప్రమాదం జరిగినట్లు పాడి రైతు గోపాల్ తెలిపారు పాలు అమ్ముకొని జీవనాన్ని కొనసాగిస్తున్నానని తన జీవనాధారం కోల్పోయానని కన్నీరు మున్నీరయ్యారు. సుమారు లక్ష రూపాయల నష్టం జరిగిందని వాపోయారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నష్టపరిహారం వచ్చే విధంగా చేయాలని రైతు గోపాల్ కోరారు. స్థానిక ఎంపిటిసి సురేందర్ ప్రభుత్వము నుండి ఏదైనా పరిహారం వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# తాండూరులో నేడు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్‌ల పంపిణీ




### ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

తాండూరు,మేజర్‌న్యూస్(జూన్ 10):
తాండూరు సెగ్మెంట్ కు సంబంధించిన తాండూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాది ముబరక్ పథకాల క్రింద మంజూరైన చెక్కులను నేడు మంగళవారం నాడు పంపిణీ చేయనున్నారు.

ఈ చెక్ లను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంల ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తారు.ఈ రెండు మండలాలకు చెందిన 237మంది లబ్ది దారులకు రెండు కోట్ల 37లక్షల 27వేల 492రూపాయాల విలువైన చెక్ లను ఇవ్వనున్నారు.ఇప్పటికే లబ్ది దారులకు సమాచారం ఇచ్చినట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.